కథానిక

# రహస్య ప్రియురాలి

## సరికొండ రవీంద్రనాథ్

ఏకాగ్రతతో బుక్ చదువుతూ కూర్చున్న స్నేహ తలెత్తి చూసింది. కండక్టర్ తోసుకుంటూ ముందుకు వెళుతున్నాడు. బస్సులో ఇది కొత్త కాదు. కానీ ఈ కండక్టర్ అసభ్యకరమైన ప్రవర్తన రోజూ తనకు ఇబ్బంది కలిగిస్తున్నది. బస్ ఎంత ఖాళీగా వున్నా అమ్మాయిలను రాసుకుంటూ ముందుకు వెళతాడు. అమ్మాయిలు కూర్చున్న సీటుకు ఆనుకుని నిలబడే ఎస్సార్ రాస్తాడు. కొద్దిగా జనం వుంటే చాలు అమ్మాయిల శరీరాలను తడుముకుంటూ టికెట్‌లు కట్ చేస్తాడు. ఎంత జుగుప్సాకరంగా వుంటుందో?

ఇప్పుడు ఒక అమ్మాయిని పాస్ తీసి చూపించమని అడుగుతున్నాడు. కాలేజీ అమ్మాయిలు అందమైన వారయితే పాస్ అడిగి, ఏ కాలేజీలో చదువుతున్నారో తెలుసుకుని పరిచయం పెంచుకోవాలని ప్రయత్నం చేస్తాడు. కొద్దిగా పరిచయం అయిన అమ్మాయి నవ్వితే వెధవ జోకులు వేస్తాడు. ఇప్పుడు ఒక అమ్మాయి భుజంపై చేయివేసి మరీ లోనికి వెళ్ళమంటున్నాడు. నోటితో చెప్పవచ్చు కదా!

స్నేహ ప్రతిరోజూ అదే రూట్‌లో ఉస్మానియా యూనివర్సిటీకి వెళుతుంది. ఎమ్మెస్సీ ఫైనలియర్ చదువుతోంది. ప్రతి రోజూ బస్సులో ఈ కండక్టరే వుంటాడు. అమ్మాయిలు ఎక్కువగా వుండే బస్సుల్లో ఇటువంటి కండక్టర్లు ప్రత్యేకంగా డ్యూటీ వేయించుకుంటారని విన్నది తను. ఉన్నతాధికార్లకు కంప్లయింటు ఇద్దామన్న ఆలోచన కూడా వచ్చింది. అంతా ఒకటే కదా, ఒక వెకిలి నవ్వుకు తప్ప దేనికీ నోచుకోదు ఆ కంప్లయింటు.

ఇటువంటి సమస్యలకు పరిష్కారాలుండవా?

బస్సు నల్లకుంట దగ్గర ఆగింది. పాతిక సంవత్సరాలుగల యువతి బస్సెక్కింది. స్నేహను చూసి పలకరింపుగా నవ్వింది. వారం రోజుల క్రితం ఈ బస్సులోనే పరిచయం. ఆమె డ్రస్ చూడగానే తెలిసిపోతుంది. పోలీస్ ఉద్యోగం చేస్తున్నదని హెడ్ కానిస్టేబుల్ ఉద్యోగం.

కొద్దిగా పక్కకు జరిగి ఆమె కూర్చోడానికి ప్లేస్ ఇచ్చింది స్నేహ.

కండక్టర్ మళ్ళీ ఇటువైపు వచ్చాడు–'టికెట్...టికెట్' అనుకుంటూ ఆడవాళ్ళను తోసుకుంటూ వెళ్ళిపోతున్నాడు.

చిరాకు పడింది హెడ్ కానిస్టేబుల్–'రాస్కెల్, బ్రూట్...బుద్ధిలేదు' అని తిట్టింది.

స్నేహకు అప్పుడు వచ్చింది మెరుపులాంటి ఆలోచన.

* * *

ఆ కండక్టర్ పేరు బాబు. తనో సినిమా యాక్టర్‌లా వుంటాననీ, అమ్మాయిలు తనంటే పడి చస్తారన్న గర్వం ఇంచుక ఎక్కువగల మనిషి. కూరగాయలు అమ్మేవారు, పల్లెల నుంచి బస్తీకి వచ్చి మార్నింగ్ షో, మ్యాట్నీ చూసే అమ్మాయిలు ఒకరిద్దరు అతనంటే ఆసక్తి చూపించడమే దీనికి కారణం.

బస్ డిపో కౌంటర్‌లో డబ్బులు లెక్క పెట్టడానికి బ్యాగ్ బోర్లించినపుడు ఉండలా చుట్టిన పేపర్ ఒకటి బైటపడింది.

ఇది తన బ్యాగ్‌లోకి ఎలా వచ్చిందబ్బా అని తీసి విప్పి చూశాడు. తెల్ల కాగితంపై నల్లని అందమైన అక్షరాలు 'మీరు మా బావలా అందంగా వుంటారు. ఐ లైక్ యు...' అని రాసి వుంది.

తన కళ్ళను తనే నమ్మలేక పోయాడు.

తను అందంగా వుండేమాట వాస్తవం. రాసింది తన గురించేనా? ఐతే రాసి తన బ్యాగ్‌లో పడేసిందెవరు? పాసింజర్‌లలో ఎవరో ఒకరై వుండాలి.

అందమైన అమ్మాయేనా?

వయసెంత వుంటుంది?

కాలేజీ చదువేనా?

బాబు మనసంతా ఆలోచనలతో ఉక్కిరి బిక్కిరై పోతోంది. ఆ అమ్మాయి ఎవరో తెలిసే అవకాశం లేదని అర్థమయ్యే సరికి జావగారి పోయాడు.

ఒకే ఒక ఆశ– ఆ అమ్మాయి మళ్ళీ బస్సు ఎక్కుతుంది. తనను పలకరిస్తుంది.

రెండు మూడు రోజులు బస్సులో ఉత్తరం రాసిన అమ్మాయి కోసం చూశాడు. అందమైన అమ్మాయి ఎవరు తన ముఖంలోకి చూసినా ఉత్తరం రాసింది ఆ అమ్మాయే అనుకున్నాడు. చివరికి జరిగిందేమిటంటే కౌంటర్‌లో డబ్బులు లెక్కకట్టి ఇచ్చే సమంలో మొదటి రోజు రెండు వందలు, రెండో రోజు నూట యాభై రూపాయిలు తక్కువ వచ్చాయి. అంటే అమ్మాయిని వెతికే హడావిడిలో చిల్లరకు బదులు నోట్లు ఇచ్చేశాడన్నమాట.

మూడో రోజున బ్యాగ్‌ను బోర్లించగానే ఉండలా చుట్టిన కాగితం కనిపించింది.

ఒక్క క్షణం గుండె కొట్టుకోవడం ఆగిపోయి తనకు తెలియకుండా ఉత్తరాన్ని తన బ్యాగ్‌లో వేయగలుగుతున్నారు.

చిల్లర లెక్కించే విషయం మర్చిపోయి తీసి చూశాడు. గత రెండు రోజులుగా మిమ్మల్ని చూస్తున్నాను. మీ కళ్ళు నా కోసం వెతుకుతున్నాయి. ఆశ, అలా కనిపిస్తానా? నాకూ మీతో సినిమాకు వెళ్ళాలని వుంది. మా ఇంటికి తీసుకు వెళతాను. ఎప్పుడో ఎలాగో నేనే చెబుతాను. బస్సులో అంతా తెలిసిన వాళ్ళే...'

ఆనందంతో 'హుయ్...య్యా!' అని అరిచాడు కండక్టర్ బాబు. 'పిట్ట లైన్‌లోకి వచ్చింది' అనుకున్నాడు.

ఇద్దరు ముగ్గురు మిత్రులతో ఈ విషయాన్ని గొప్పగా చెప్పకున్నాడు.

'ఏడిపిస్తోందిరా బాబూ...' అన్నాడు విసుగు నటిస్తూ ఒక మిత్రునితో.

'అందంగా వుంటుందా'

'నేను చూడ్లేదు. ఉద్యోగం చేస్తున్నట్టే వుంది'

'అబ్బ లక్కీ ఛాన్స్ కొట్టేశావ్‌రా...' ఫ్రెండ్ నుంచి ఈ కామెంట్ వినేసరికి ప్రపంచాన్ని జయించినంత ఆనందం కలిగింది బాబుకు.


మరునాడు కౌంటర్‌లో చిల్లర బోర్లించినపుడు కనిపించింది ఉండలా చుట్టిన తెల్లని కాగితం. తన రహస్య ప్రియురాలి సందేశం ఇంత త్వరగా వస్తుందని బాబు ఊహించ లేదు.

'రేవు ఉదయం పది గంటలకు నల్లగుంట బస్టాప్‌లో పోలీసు డ్రస్‌తో బస్సు ఎక్కుతాను. నన్ను చూడగానే మరదలా...బావున్నావా!' అని చనువుగా పలకరించండి. మన చనువు చూసి అంతా బంధువులం అనుకుంటారు. మనం ఫ్రీగా మాట్లాడుకోవచ్చు. తర్వాత ఎక్కడికి వెళ్ళాలో నేను చెబుతాను...' వివరంగా రాసి వుంది.

ఆమె తెలివి తేటలకు ఆశ్చర్యపోయాడు. ఇంత పకడ్బందీగా ప్లాన్ వేసిందంటే బాగా చదువుకున్నదై వుంటుంది. తనదేమో ఇంటర్మీడియెట్. చదువుకున్న అందమైన అమ్మాయితో...ఓహ్...తనెంత అదృష్టవంతుడు.

ఉదయం ఆ అమ్మాయిని ఎలా టాకిల్ చేయాలా అని అనుక్షణం ఆలోచిస్తూండిపోయాడు.

ఆ రోజు కౌంటర్ దగ్గర సుమారు వంద రూపాయిలు తక్కువ వచ్చాయి. బాబు లెక్క చేయలేదు. రాత్రంతా నిద్ర లేకుండానే గడిపాడు. భార్య కూడా అనుమానించినట్టు ఏంటీ ఆలోచి




.స్తున్నావ్ అని అడిగింది రెండుసార్లు.

ఎప్పటిలాగే ఆ రోజు తెల్లవారింది. బాబు మనసు ఎప్పుడు తన రహస్య ప్రియురాలిని కలుసుకుంటానా అని ఆత్రుతతో వుంది. పది గంటల సమయంలో నల్లకుంట బస్టాప్ దగ్గరకి వచ్చేసరికి డ్రైవర్ సీటుకు దగ్గరగా వచ్చి నిలుచున్నాడు బాబు.

బస్సు ఆగగానే అందర్నీ తోసుకుంటూ లోనికి ప్రవేశించి హెడ్ కానిస్టేబుల్. తన కళ్ళను తానే నమ్మలేనట్టు చూశాడు. కొనదేరిన ముక్కు, తీర్చి దిద్దినట్టున్న పెదాలు, అందమైన కళ్ళు, చిన్న చుబుకం, అరేబియన్ గుర్రంలా శరీర సౌష్టవం.

ఒక్క క్షణం గుండె గొంతుకలో కొట్టాడుతున్నట్టు నోట మాట రాకుండా అయిపోయాడు బాబు.

వంట్లోంచి వెచ్చగా వస్తున్న ఆవిర్లు చెవుల్లోంచి బైటికి వెళుతున్నాయి.

హెడ్ కానిస్టేబుల్ విసుక్కుంటూ జనాన్ని తోసుకుంటూ బస్సు మెట్లెక్కి లోనికి వచ్చింది.

ఆమె దగ్గరకు రాగానే నవ్వుతూ 'ఏం మరదలా...బావున్నావా!' అన్నాడు.

హెడ్ కానిస్టేబుల్ అర్థం కానట్టు చూసింది.

'ఏం పోలీసు మరదలా నిన్నే...బావున్నావా, మన వాళ్ళు ఎలా వున్నారు?' తన తెలివి తేటలతో అల్లుకుపోతున్నాడు బాబు.

హెడ్ కానిస్టేబుల్ ముఖం కోపంతో ఎర్రగా జేవురించిపోయింది. 'యూ...రాస్కెల్' అంటూ ఈడ్చి బలంగా బాబు చెంపపై కొట్టింది. ఆ దెబ్బ బస్సులో పెద్ద మోతతో ప్రతిధ్వనించింది.

మరో దెబ్బ...మరో దెబ్బ వరసగా నాలుగు పడ్డాయి.

చుట్టూ వున్న వారికి ఏం జరుగుతున్నదో మొదట అర్థం కాలేదు. అర్థమైన తర్వాత 'రౌడీ వెధవ తన్నండి' అని అరిచారు. వెనక నుంచి నలుగురు మగవాళ్ళు వచ్చి కండక్టర్ బాబును ఉతికేశారు.

బస్సు ఆగిపోయింది. ఎవరికి తోచింది వారు చెవుతున్నారు. ఎవరిష్టం వచ్చినట్టు వారు చెవుతున్నారు.

బస్సు దిగింది స్నేహ. ఇక ఆ బస్సు మరో గంట వరకూ కదలదని ఆమెకు తెలుసు. రోడ్డుపై వెళుతున్న ఆటోను పిలిచి అందులో ఎక్కేసి 'యూనివర్సిటీకి పోనివ్వు' అంది.

◆